

62.786 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయంలో శుక్రవారం 62.786 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి 21,467 క్యూసెక్కుల వరద వస్తోంది. కండలేరుకు 10వేలు, ఇతర కాలువలకు 355 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.80,290
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,294
3శాతం జీఎస్టీతో	రూ.7,513
నవర (8గ్రా)	రూ.60,104

గరిష్ఠం/కనిష్ఠం
35.4 /26.4

వాతావరణం

గాలిలో తేమ 56 శాతంగా శుక్రవారం నమోదైంది. జిల్లాలో శనివారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పోలీసుల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం



మహిళా సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

నెల్లూరు (క్రైమ్): పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ జి. కృష్ణకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. 15 మంది సిబ్బంది తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తెచ్చారు. వారి సమస్యలను తెలుసుకున్న ఆయన త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సిబ్బంది కోరుకున్న చోటకే పారదర్శకంగా బదిలీ చేస్తామన్నారు. సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



డీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలాజీరావు

నెల్లూరు (టౌన్): ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని నూతన డీఈఓ ఆర్.బాలాజీరావు తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా చూస్తానన్నారు. నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. విద్యాశాఖ డిప్యూటీ డీఈఓలు, ఏడీలు, సూపరింటెండెంట్‌లు, పలు సెక్షన్ల ఉద్యోగులు నూతన డీఈఓను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గత డీఈఓ పీవీజే రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలకు నేడే ఆఖరు

నెల్లూరు (టౌన్): సమగ్ర శిక్షలో బోధనా పోస్టులకు ఎంపికై సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులకు సంబంధించి తాత్కాలిక మెరిట్ లిస్ట్‌ను సమగ్రశిక్ష కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్ట్‌పై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రంలోపు సమగ్రశిక్ష కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు జీ పద్మావతి



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు జీ పద్మావతి

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బీ పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సంక్షేమ శాఖల అధికారులు, వసతిగృహ సంక్షేమ అధికారులు, వార్డెన్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ వసతిగృహాల్లో పిల్లలు అనేక హింసలకు, మానసిక వేధింపులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ వసతిగృహాల్లో అధికారులు పిల్లలను ప్రత్యేక శ్రద్ధతో చూడాలన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో ఉండే పిల్లలకు పాఠశాలల్లో పాఠ్యాంశాలతో పాటు బాలల చట్టాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ వసతిగృహాల్లో తప్పనిసరిగా ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయాలని చెప్పారు. సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రమీల, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ప్రసన్న, సంక్షేమ వసతిగృహాల అధికారులు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

ఉచిత ఇసుక ఉత్తిదే





కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న కాకాణి, జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

టీడీపీ నేతలకే ఫ్రీ

- గత ప్రభుత్వంలో కంటే ఐదు రేట్లు పెరిగిన ధరలు
- రోజుకొక మోసపూరిత ప్రకటన
- బ్లాక్ మార్కెట్‌పై రోడ్డెక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ప్రతి కార్యకర్తకు, ప్రజలకు పార్టీ పరంగా అండగా ఉంటాం
- కేసులకు, బెదిరింపులకు భయపడేది లేదు
- మాజీ మంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నాయకులు
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, ధర్నా

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో కేవలం టీడీపీ నేతలకే దోచి పెడుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. దాదాపు ఐదు నెలలుగా ఇసుక బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుండడంతో జిల్లాలో కొరత ఏర్పడి నిర్మాణం రంగం కుదేలైపోయిందన్నారు. సామాన్య ప్రజలకు తట్టెడు ఇసుక కూడా ఉచితంగా దొరకడం లేదని, గతంలో కంటే ఐదు రెట్లు అధికంగా ధర పెరిగిందని విమర్శించారు. జిల్లాలో ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కూలీలకు పనులు లేక పస్తులు ఉంటున్న నేపథ్యంలో వారితో కలిసి శుక్రవారం జిల్లా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ర్యాలీ, ధర్నాతో కలెక్టరేట్ దద్దరిల్లింది. తొలుత వీఆర్‌సీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీ, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఊరూరా తమ్ముళ్ల మాఫియాలు



ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక్కొక్క దోపిడీకి ఒక్కొక్క మాఫియా తయారైందన్నారు. నియోజకవర్గ పరిధిలో అడుగడుగునా పెన్నానది నుంచి ఇసుకను దోచుకుంటున్నారన్నారు. ఆత్మకూరులో టీడీపీ మాఫియా భాగాలు పంచుకుని జేబులు నింపుకుంటున్నాయన్నారు. పోలీసులు వారికే వంత పాడుతున్నారు. ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారన్నారు. పేదలకు ఉచిత ఇసుక ఇచ్చే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదన్నారు. ఈ ప్రభుత్వంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికే భద్రత లేనప్పుడు సామాన్య ప్రజలకు భద్రత ఎక్కడుంటుందన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం లేకుండా పోయిందని, భద్రత లేదని సొంత పిస్టల్ వాడుకుంటానని మాట్లాడుతున్న తీరు చూస్తుంటే.. ఈ ప్రభుత్వంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

దుర్మార్గమైన పాలన



సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇసుకను అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు తరలిస్తుండడంతో స్థానికంగా పనులు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలను, పార్టీ శ్రేణులను వేధించి, ఇబ్బందులకు గురి చేసే ఏ ఒక్కరిని వదిలిపెట్టమని హెచ్చరించారు. టీడీపీ నేతల ఆట కట్టిస్తామన్నారు.

తెలుగు తమ్ముళ్ల జేబులు నింపే పథకం

మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ పేరుకే ఉచిత ఇసుక అని, ఇది కేవలం తెలుగు తమ్ముళ్ల జేబులు నింపే పథకమన్నారు. సామాన్యులు ఇసుక రీచ్‌లోకి వెళ్లే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. రీచ్‌లోకి వెళ్లి ఉచితంగా ఇసుక తెచ్చుకోవాలంటే టీడీపీ స్టిక్కర్ ఉండాలన్నారు. ఇసుకపై చంద్రబాబు రోజుకో మోసపూరిత ప్రకటనలు చేస్తూ ప్రజలను దగాకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇసుక ద్వారా ఏటా రూ.750 కోట్లు ప్రభుత్వ ఖజానాకు లభించిందన్నారు. ఉచిత ఇసుకతో పాటు చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆయన మెడలు వంచే దాకా పోరాటం చేస్తామన్నారు. ఇసుక ద్వారా గతంలో రాష్ట్ర ఖజానాకు రాబడి వస్తే.. ఇప్పుడు టీడీపీ నేతల ఖజానాల్లోకి వెళ్తున్నాయన్నారు. టీడీపీ నేతలకే ఉచిత ఇసుక అమలు అవుతుందని, వీళ్ల అవినీతిపై కలెక్టర్‌తో పాటు, అధికార యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలన్నారు. ఏం మాట్లాడినా కూడా మాపై పోలీసులు కేసులు పెడుతున్నారన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే ఉంటామన్నారు. కేసులకు భయపడేది లేదని, పార్టీ కార్యకర్తల నుంచి ప్రజల వరకు అండగా నిలబడతామన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఇసుక దోపిడీని ఆపాలన్నారు. లేనిపక్షంలో ప్రజల తరఫున తమ ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు.

ఇసుకను అన్నదమ్ములు దోచేస్తున్నారు



నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్ రెడ్డి కనుసన్నల్లో అవినీతి, అక్రమాలు, ప్రజా సంపద దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. పొట్టేపాళెంలో ఇసుక రీచ్ లేకపోయినా మెషీన్లు పెట్టి నిత్యం వేల యూనిట్లు ఇసుకను దోచుకుంటున్నారన్నారు. అక్రమ రవాణా చేస్తున్నారని అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఇసుక దోపిడీని అరికట్టడానికి పోలీసులకు సిబ్బంది కొరత ఉందంటే.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులకు అండగా ఉంటారని, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఇసుక అక్రమ రవాణాను ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎక్కడికక్కడ అడ్డుకోవాలని, ప్రజలకు ఉచిత ఇసుక చేరే వరకు తమ పోరాటం ఆగదన్నారు.

తమ్ముళ్లకే ఇసుక, మద్యం



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు నిలిపివేసి ఉచిత ఇసుక, మద్యంను టీడీపీ నేతలకే అప్పగించారన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో మహిళలకు ఇబ్బంది కలిగేలా షాపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఏదైనా సమస్య వస్తే ప్రజాప్రతినిధులకు చెప్పుకోవాలి. కానీ వారే షాపులు నిర్వహిస్తున్నారన్నారు. రాత్రి వేళల్లో టిప్పర్లకు డంపర్‌లకు 40 టన్నులు పైచిలుకు ఇసుకను లోడ్ చేసుకుని ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారన్నారు.

- రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ చంద్రబాబు మెడలు వంచైనా సరే హామీలు అమలు చేయిస్తామన్నారు. టీడీపీ నాయకులు ఇసుకను దోచుకుంటున్నారన్నారు. ఇసుక దోపిడీకి అధికారులు సహకరిస్తున్నారన్నారు.

సామాన్యులు బయట తిరగలేని పరిస్థితి



కందుకూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం సామాన్య ప్రజలు ఇంట్లోంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చే హామీలు ఆచరణ సాధ్యం కాదని ఆనాడే తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి నేతలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. ఇసుక ద్వారా టీడీపీ నాయకులు రూ.వందల కోట్లను జేబుల్లో నింపుకొంటున్నారన్నారు.

ఏపీలో అరాచక పాలన



కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీలో అరాచక పాలన సాగుతోందన్నారు. ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై నిత్యం హత్యలు, దోపిడీలు, దాడులు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు గెలుపు ఏ విధంగా జరిగిందో ప్రజలందరికీ తెలుసన్నారు. రెండోసారి మోసపోయామని ప్రజలే బాహాటంగా చెబుతున్నారన్నారు. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను టీడీపీ నేతలు దోచుకున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతుంటే ఇసుకను బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటున్నారన్నారు. కేసులు, కక్ష సాధింపులు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు.

మరో కేజీఎఫ్.. క్వార్ట్జ గనులు

సైదాపురంలో దొరికే క్వార్ట్జ (తెల్లరాయి)కు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉండడంతో ఈ ప్రాంతం ఇప్పుడు మరో కేజీఎఫ్‌లా మారింది. ఏడాది క్రితం ఇక్కడ మైనింగ్ అనుమతులు తెచ్చుకున్న నెల్లూరుకు చెందిన కీలకనేత తెల్లరాయి గనుల ద్వారా కాసులు వర్షం కురుస్తుండటంతో ఎన్నికల వేళ టీడీపీలో చేరిపోయాడు. ఇప్పుడు అధికార పార్టీ నేత కావడంతో మైనింగ్ డాన్‌గా ఎదిగేందుకు తన అనుచర వర్గాన్ని రంగంలోకి దింపాడు. అనుమతులు లేని గనులతో పాటు ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా తవ్వేస్తూ ఇతర జిల్లాల పర్మిట్లతో తెల్ల బంగారాన్ని అక్రమ రవాణా చేసి జేబులు నింపుకొంటున్నాడు. ఇక్కడి తెల్లబంగారంపై స్థానిక ఎమ్మెల్యేతో పాటు గ్రామస్థాయి నేతల కన్ను పడడంతో వాటాల పేచీ వచ్చింది. వారే అక్రమ రవాణా విషయంపై అధికారులను ఉసిగొల్పి దాడులు చేయించడంతో వ్యవహారంపై టీడీపీ నేతల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతోంది.

- లీజు గడువు తీరిన గనుల్లో కూటమి నేతల తవ్వకాలు
- వాటిని దక్కించుకునేందుకు నేతల మధ్య అంతర్యుద్ధం
- ఎన్నికల వేళ కూటమిలో చేరిన నెల్లూరు నేత కనుసన్నల్లో మైనింగ్
- వాటాలు ఇవ్వలేదని వారే పట్టించిన వైనం

సైదాపురం: జిల్లాలోని సైదాపురం మండలంలో లీజు కాలం తీరిన గనులు 26 వరకు ఉన్నాయి. ఆయా గనుల్లో స్క్రాప్ మైకా కోసం కొందరు వ్యాపారస్తులు కొంత నగదును పాత యాజమానికి ఇచ్చి తవ్వకుంటున్నారు. అందులో సైదాపురంలో మూడు, చాగణం రాజుపాళెంలో నాలుగు, ఊటుకూరులో మూడు, పెరుమాళ్లపాడులో మూడు, పెరుమాళ్లపాడు–తురిమెర్ల మధ్యలో మరో రెండు, కలిచేడులో రెండు, గిద్దలూరులో రెండు, జోగిపల్లిలో 4, తలుపూరులో మరో 5 గనులు ఉన్నాయి. ఆయా గనుల్లో గుట్టలు గుట్టలుగా వదిలేసిన వేస్ట్‌లో మైకా ఖనిజం ఇప్పుడు కాసుల వర్షం కురిపిస్తుంది. టన్ను రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతుండడంతో ఆయా గనులను అధికార పార్టీ నేతలు చేజిక్కించుకుని అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. లీజు గడువు తీరిన గనుల్లో దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన ఖనిజం ఉండడంతో టీడీపీ నేతలు ఎవరికి వారు దోపిడీ చేసేందుకు అడ్డదారులు వెతుక్కుంటున్నారు.

కాసులు కురిపిస్తున్న జయలక్ష్మి మైకామైన్స్

మండలంలోని ఓరుపల్లి సమీపంలో ఉన్న జయలక్ష్మి మైకామైన్స్ గతంలో చెన్నైకు చెందిన శ్రీషిరిడీ సాయి మైన్స్ కంపెనీ అధీనంలో ఉండేది. సర్వే నంబర్ 1లో 12.65 సెంట్లు, గ్రామనత్తం పొరంబోకు భూమి, 2/1లో 14.29 ఎకరాల్లో అనాధీనం భూమి ఈ మైన్స్ ఉంది. 1974 నుంచి 2021 వరకు ఆ కంపెనీకి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. 18–03–2021 ఆ కంపెనీకి లీజు గడువు ముగిసిపోయింది. ఆ తర్వాత ఆ కంపెనీ మళ్లీ లీజుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతులు ఇవ్వలేదు. ఆ తర్వాత సదరు కంపెనీ యాజమాన్యం ఇతరులకు విక్రయించింది. ఈ గనికి సంబంధించి హక్కులు మూడు పర్యాయాలు చేతులు మారాయి. ఎంత మంది చేతులు మారినా లీజు అనుమతులు అయితే మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో కాసులు కురిపించే ఈ మైన్‌ను సొంతం చేసుకునేందుకు అనధికారకంగా స్థానిక ఎమ్మెల్యే బంధువు భూమి పూజలు చేయడంతో ప్రస్తుతం వివాదం నెలకొంది.



లీజు లేకుండా అక్రమంగా తవ్వకాలు

వాటా ఇవ్వలేదనే..

సైదాపురంలో ఉన్న శ్రీనివాస పద్మావతి గనిని ఏడాది క్రితం నెల్లూరు కార్పొరేషన్‌లో కీలక నేత సొంతం చేసుకున్నారు. అయితే ఆ గనికి లీజు వ్యవధి తీరిపోయింది. ఎన్నికల సమయంలో సదరు నేత వైఎస్సార్‌సీపీని వీడి కూటమిలో చేరిపోయాడు. సదరు నేత కనుసన్నల్లో అనధికారికంగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇతర జిల్లాల పర్మిట్లతో అక్రమ రవాణా సాగిస్తున్నాడు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో వాటాల కోసం స్థానిక టీడీపీ నేతలు డిమాండ్ చేయడంతో ఆయన ఇవ్వడానికి సుముఖత చూపలేదు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధితో పాటు ఆయన అనుచర వర్గానికి కడుపు మండింది. ఎక్కడో నెల్లూరు నుంచి వచ్చి సైదాపురంలో అక్రమ రవాణా చేయడమే కాకుండా వాటాలు అడిగితే ఇవ్వకపోవడంపై కన్నెర్ర చేశారు. వెంటనే స్థానిక ప్రజాప్రతినిధి ద్వారా తహసీల్దార్, ఎస్సైను పంపించి దాడులు చేయించారు. భారీ యంత్రాలు, టిప్పర్లను స్వాధీనం చేయించుకుని కేసులు నమోదు చే యించారు. అయితే ఈ వ్యవహారంలో నెల్లూరు ఎంపీ కార్యాలయం నుంచి రాజకీయ ఒత్తిడి తెచ్చినా స్థానిక ఎమ్మెల్యే ససేమిరా అనడంతో కేసులు నమోదు కావాల్సి వచ్చింది. దీంతో నెల్లూరు నేతపై కేసు లేకుండా అతని వ్యాపార భాగస్వామి అయిన అమర్‌నాథ్‌రెడ్డితో పాటు మరో 11 మందిపై కేసులు నమోదు చేయించారు.



విలువైన మైకా క్వార్ట్జ ఖనిజం

కొత్త విధానం.. మరింత భారం

- పోషణ్ ట్రాకర్, బాలసంజీవన్ యాప్‌లతో పౌష్టికాహారం పంపిణీ
- సైబర్ నేరాల నేపథ్యంలో ఓటీపీలు చెప్పని తల్లిదండ్రులు
- అంగన్‌వాడీ కార్యకర్తలకు కష్టాలు
- ఫేస్ రికగ్నిషన్ వద్దంటున్న వైనం


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

సంగం: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా ఏర్పాటు చేసిన యాప్‌లతో సిబ్బందికి పనిభారం మరింతగా పెరిగింది. గర్భిణులు, బాలింతలకు సంబంధించి పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఫేస్ రికగ్నిషన్‌ను తప్పనిసరి చేశారు. ఈనెల నుంచి పిల్లలకు కూడా అదే విధానం అమలు చేయాలంటూ కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఫేస్ రికగ్నిషన్ కోసం ఓటీపీలు తప్పనిసరిగా మారాయి. సైబర్ నేరాల నేపథ్యంలో పలువురు తల్లిదండ్రులు ఓటీపీలు చెప్పేందుకు భయపడుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి హాజరు ప్రక్రియ వద్దంటూ తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

యాప్‌లతో ఇబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ జరుగుతుంది. రెండున్నర కిలోల బాలామృతం ప్యాకెట్, 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందజేస్తున్నారు. వీటిని చిన్నారులకు ఇవ్వాలంటే యాప్ ద్వారా హాజరును తప్పనిసరిగా తీసుకోవాల్సి వస్తుంది. దీని ప్రకారం ఫేస్ రికగ్నేషన్, ఈ–కేవైసీ, మొబైల్ వెరిఫికేషన్ చేయాలి. ఈ మూడింటికీ సంబంధించి ఆ చిన్నారి పేరుతో అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. పలువురు తల్లిదండ్రులకు ఓటీపీలపై అవగాహన లేకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు మరో ప్రధాన సమస్య సైతం వెంటాడుతోంది. ఒక ఇంట్లో ముగ్గురు చిన్నారులుంటే ఇద్దరికే తల్లి మొబైల్ నంబర్ పనిచేస్తోంది. కార్యకర్తల ఫోన్ నంబర్‌తో ఐదుగురికి మాత్రమే పంపిణీకి అవకాశం ఉంది. ప్రతిసారి ఓటీపీని నమోదు చేయడం మరింత క్లిష్టంగా మారింది.

లక్ష్యం కోసం పరుగులు

పోషణ్ ట్రాకర్ యాప్‌లో వివరాల నమోదు కోసం కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉంటుంది. కూటమి ప్రభుత్వంలో అనధికారిక నిబంధన అమల్లోకి వచ్చింది. ఒక్కరోజులోనే నూరు శాతం నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో కార్యకర్తలు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కోసారి యాప్ ఎప్పుడు వినియోగంలోకి వస్తుందో కూడా తెలియడం లేదు. సాధారణంగా సెలవు రోజుల్లో యాప్ వినియోగంలోకి వస్తే మళ్లీ కేంద్రాలకు పరుగు తీయాల్సి ఉంటుంది. దీనికితోడు నిత్యం చిన్నారులకు అందించే పౌష్టికాహారం విషయంలో ఉదయం 8 గంటల సమయంలో మెనూ జారీ చేస్తారు. దానికి తగ్గట్లుగా గంట వ్యవధిలోనే అన్నీ సమకూర్చుకుని పిల్లలకు అందించి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సిలబస్ ప్రకారం అమలు చేయకుంటే ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావాల్సిన పరిస్థితి. మళ్లీ కేంద్రంలో చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించడం, గర్భిణులకు, పౌష్టికాహారం ఇవ్వడం, రిజిస్టర్లు రాసుకోవడం.. ఇలా అంగన్‌వాడీ కార్యకర్తలకు మరింత భారంగా మారింది. గతంలో ఉన్న యాప్‌లో వివరాలు ఏమైనా తప్పుగా నమోదు చేసి ఉంటే వాటిని సరిచేసేందుకు కూడా ఇప్పటి వరకు అవకాశం రాలేదు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	2,934
చిన్నారుల సంఖ్య	33,306
కేంద్ర ప్రభుత్వ యాప్	పోషణ్ ట్రాకర్
రాష్ట్ర ప్రభుత్వ యాప్	బాలసంజీవని

యాప్‌లో మార్పులు చేస్తున్నారు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ ట్రాకర్ విధానంపై ఎప్పటికప్పుడు కార్యకర్తలకు ఇబ్బందులు లేకుండా మార్పులు జరుగుతున్నాయి. ప్రతి కార్యకర్త యాప్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ యాప్‌ల ద్వారా పౌష్టికాహారం సరఫరా పారదర్శకంగా జరుగుతుంది.

– హేనాసుజన్, పీడీ, ఐసీడీఎస్

ఏమంటున్నారంటే..

కొత్త విధానం అమలు వద్దంటూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాల్సిందేనంటూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. చిన్నారుల పౌష్టికాహార పంపిణీ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకే ఈ యాప్‌లను అందుబాటులోకి తెచ్చామని చెబుతున్నారు.

జాతీయ స్థాయిలో జిల్లా పోలీసుల సత్తా

- అభినందించిన ఎస్పీ కృష్ణకాంత్


క్రీడాకారులతో ఎస్పీ, ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్): తొమ్మిదో ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్ గేమ్స్ – 2024లో జిల్లా పోలీసులు చరణ్‌తేజ, రాజశేఖర్, శ్రావణిలు సత్తా చాటారు. అసోం రాష్ట్రం గువాహాటిలో ఈ ఏడాది జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు ఆ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు జరిగాయి. పెన్‌కాక్ సిలాట్‌లో నెల్లూరు స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ కె.చరణ్‌తేజ మొదటి స్థానంలో, కందుకూరు పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాజశేఖర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ కరాటేలో శ్రావణి తృతీయ స్థానం సాధించారు. వీరు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు, ఇంక్రిమెంట్లు అందుకున్నారు. చరణ్‌తేజ, రాజశేఖర్‌లను శుక్రవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోవు రోజుల్లో క్రీడల్లో మరింతగా రాణించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

- పట్టించుకోని అధికారులు


కొర్లపాడు సంగం సమీపంలోని చెరువులో గ్రావెల్ తవ్వకాలు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి గ్రామంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటోంది. సర్వేపల్లి పంచాయతీ పరిధిలోని కొర్లపాడు సంగం వద్దనున్న చెరువులో మూడు రోజుల నుంచి జేసీబీతో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. తవ్విన దానిని ట్రాక్టర్ల ద్వారా నూతనంగా ఏర్పాటు చేసే మద్యం దుకాణానికి, ఇతర ప్రైవేట్ స్థలాలకు తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యులు ఇంటి అవసరాల కోసం మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించుకునే ప్రయత్నాలు చేస్తే కొందరు టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. కానీ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు రాజగోపాల్‌రెడ్డి పేర్లు చెప్పుకొని కొందరు తెలుగు తమ్ముళ్లు ఎలాంటి అనుమతులు లేకుండానే గ్రావెల్ వ్యాపారం చేస్తుండటంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. మద్యం దుకాణం నిర్వాహకుల వద్ద నుంచి రూ.లక్షలు తీసుకుని గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సర్వేపల్లిలో గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌లో అలజడి

- ఇద్దరు ఉద్యోగులకు రివర్షన్
- అప్పటి ఈఓ సెల్వి ఇదివరకే సస్పెన్షన్
- ఈడీకి షోకాజ్ నోటీసులు


ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన నెల్లూరు ఎస్సీ కార్పొరేషన్‌లో మరోసారి అలజడి రేగింది. ఇద్దరు టైమ్ స్కేల్ ఉద్యోగులకు రివర్షన్ ఇవ్వాలని లోకాయుక్త సంబంధిత రాష్ట్ర అధికారులను ఆదేశించింది. గతంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేసిన సారయ్య, ఈఓ సెల్విలను సస్పెండ్ చేయాలని వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏం జరిగిందంటే..

కార్పొరేషన్లో టైమ్ స్కేల్ ఉద్యోగులుగా పనిచేస్తున్న భారతికి జూనియర్ అసిస్టెంట్, ఎస్‌కే రఫీ అహ్మద్‌కు టైపిస్టుగా పదోన్నతులు కల్పించారు. ఇది అక్రమమంటూ 2022లో లోకాయుక్తకు లాయర్ పాముల హరిప్రసాద్ ఫిర్యాదు చేశారు. అప్పటి ఈడీ రమేష్ స్థానికంగా సిబ్బందితో విచారణ జరిపి రాష్ట్రస్థాయి అధికారులకు నివేదికను పంపారు. లోకాయుక్త స్పందించి పిటిషనర్ ఆరోపణలపై విచారణ జరిపించాలని వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించింది. దీంతో అప్పటి కార్పొరేషన్ జీఎం కె.సునీల్ రాజ్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణ చేపట్టి ప్రమోషన్లు, అప్పటి ఈడీ సారయ్య, ఈఓ సెల్వి పనితీరుపై లోకాయుక్తకు నివేదిక అందజేశారు. ప్రమోషన్లు అందుకున్న టైమ్ స్కేల్ ఉద్యోగులను రివర్షన్ చేయాలని లోకాయుక్త ఆదేశించింది. అలాగే అప్పటి అధికారులను సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. కాగా సెల్వి మరొక వివాదంలో సస్పెండై ఉండడం గమనార్హం. సారయ్య ప్రస్తుతం అనంతపురం జిల్లాలో పనిచేస్తున్నారు. ఈయనకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. రివర్షన్ ఉత్తర్వులను అమలు చేయడంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని కొందరు ప్రశ్నిస్తున్నారు.

ఆదేశాలను అమలు చేస్తాం

టైమ్ స్కేల్ ఉద్యోగుల రివర్షన్‌పై రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించి కలెక్టర్ ఆనంద్ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం. లోకాయుక్త వారికి ఇదే సమాచారాన్ని అందజేశాం. ఇందులో జాప్యానికి తావు లేదు.

– నిర్మలాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	132
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	262
లేయర్ చికెన్	187

రెజ్లింగ్ జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీనియర్ మహిళలు, పురుషుల జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపికలను ఈనెల 27వ తేదీన నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా న్యూ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్‌కుమార్‌రెడ్డి, నాగేంద్రరావులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు నవంబర్ 9, 10 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఇతర వివరాలకు 94416 44761 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


సత్యనారాయణ (ఫైల్)

కొడవలూరు: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండలంలోని తలమంచి వడ్డిపాళెంలో చోటుచేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. గుంజి సత్యనారాయణ (50), శారదమ్మ దంపతుల స్వగ్రామం తలమంచి వడ్డిపాళెం. కొంత కాలంగా వారు కోవూరు వడ్డిపాళెంలో కుమారులతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో మూడురోజుల క్రితం సత్యనారాయణ కుటుంబసభ్యులపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతను తిరిగి రాకపోవడంతో పెద్ద కుమారుడు అనిల్ తలమంచి వడ్డిపాళేనికి శుక్రవారం వెళ్లాడు. అక్కడి వారింట్లోనే తండ్రి కిటికీకి ఉరేసుకుని ఉండడాన్ని గుర్తించాడు. ముఖం, శరీరంపై గాయాలుండడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు మాగుంట లేఅవుట్ బ్రిడ్జి వద్ద నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై శుక్రవారం జరిగింది. మృతుడి వయసు 55 నుంచి 60 సంవత్సరాల్లోపు ఉంటుందని భావిస్తున్నారు. తెలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, ఎరుపు, పసుపు రంగుల గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?

నెల్లూరు(క్రైమ్): ఆటో మెకానిక్ ముక్తియార్ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన ముక్తియార్ అయ్యప్పగుడి సమీపంలోని పఠాన్‌బాబు మెకానిక్ షెడ్‌లో పనిచేస్తున్నాడు. అతను షాపు యజమాని బాబు చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న నిందితుడు బాబును శుక్రవారం వేదాయపాళెం పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. ముక్తియార్ తాకట్టులో ఉన్న తన ఆటోను విడిపించుకునేందుకు రూ.30 వేలు డబ్బులు ఇవ్వాలని మూడురోజులుగా బాబును అడుగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం షాపు వద్దకు వెళ్లి నగదు ఇవ్వాలని అడిగాడు. దీంతో క్షణికావేశంలో బాబు ఇనుపచువ్వతో ముక్తియార్‌ను హతమార్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. నిందితుడిని నేడో, రేపో పోలీసులు అరెస్ట్ చూపించే అవకాశం ఉంది.

నిమ్మ ధరలు (కిలో)


పెద్దవి : రూ.70
సన్నవి : రూ.40
పండ్లు : రూ.25

క్లుప్తంగా

టీడీపీ నాయకుడి నిర్వాకం

- గిరిజనుల దాహం కేకలు


తాగునీరు సరఫరా చేసే నేలబావి

వెంకటాచలం: టీడీపీ నాయకుడి నిర్వాకంతో తాగునీరందక గిరిజనులు అల్లాడిపోతున్నారు. మండల కేంద్రమైన వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు ప్రాంతంలోని గిరిజనకాలనీలో 30 కుటుంబాలు ఉంటున్నాయి. కాలనీ సమీపంలోనే నేలబావి నుంచి మోటార్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. అయితే గురువారం రాత్రి గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత కాలనీకి చేరుకుని తాగునీరు సరఫరా చేసే వ్యక్తి వద్ద మోటార్ షెడ్ తాళాన్ని దౌర్జన్యంగా తీసుకెళ్లాడు. దానిని ఓ దుకాణం నిర్వాహకుడికి ఇచ్చాడు. ముందు దుకాణాలకు నీటి సరఫరా చేసుకుని ఆ తర్వాత కాలనీకి సరఫరా చేయాలని ఆదేశించాడు. నగదు ఇస్తేనే నీటి సరఫరా చేయాలని చెప్పడంతో గిరిజనకాలనీ వాసులు శుక్రవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వివాహితను అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో భర్త, అత్తింటివారిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు నేతాజీనగర్‌కు చెందిన నూరిన్‌కు కావలికి చెందిన షాదాబ్‌తో గతేడాది జూలైలో వివాహమైంది. ఆ సమయంలో నూరిన్ కుటుంబ సభ్యులు రూ.2 లక్షల నగదు, 12 సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు కట్నకానుకల కింద ఇచ్చారు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు నూరిన్‌ను వేధించడం ప్రారంభించారు. ఆమె గర్భవతైంది. అయితే సకాలంలో వైద్యులకు చూపించకపోవడంతో అనారోగ్యానికి గురైంది. వైద్య పరీక్షల నిమిత్తం తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. భర్త పట్టించుకోవడం మానేశాడు. దీంతో నూరిన్ తన తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. కొంత కాలానికి షాదాబ్ ఆమె వద్దకు వచ్చి తాను తప్పు చేశానని చెప్పి కలిసి ఉండసాగాడు. ఈ ఏడాది మేలో నూరిన్ అబ్బాయికి జన్మనిచ్చింది. షాదాబ్ భార్య పేరుపై నున్న క్రెడిట్ కార్డు, బ్యాంక్ అకౌంట్ల నుంచి నగదు వాడుకుని కావలికి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి భార్య ఫోన్ చేస్తున్నా పట్టించుకోలేదు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

మహిళా ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

నెల్లూరు(దర్గామిట్ట): మహిళా ఉద్యోగులు ఉండే ప్రతి కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు సైకం శివకుమారిరెడ్డిలు కోరారు. శుక్రవారం వారు నెల్లూరు జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కనీస సౌకర్యాల్లేక మహిళా ఉద్యోగులు అనేక అవస్థలు పడుతూ అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. అనంతరం డివిజన్ కమిటీల ఏర్పాటుపై సూచనలు చేశారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో షీ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్‌ను విజయలక్ష్మి, శివకుమారిరెడ్డిలు కోరారు. ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కోటమ్మ, వైస్ చైర్‌పర్సన్ విజితారెడ్డి, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓవీ ప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు థామస్ పాల్గొన్నారు.

అటవీ శాఖ సిబ్బందిపై ఎలుగుబంట్ల దాడి


గాయపడిన రోశయ్య

మర్రిపాడు: మండలంలోని కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం అటవీ శాఖ బేస్‌క్యాంప్ సిబ్బంది రోశయ్యపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. అతని చేతికి గాయమైంది. అధికారుల కథనం మేరకు.. అడవిలో పెట్రోలింగ్ నిర్వహించేందుకు ఐదుగురు సిబ్బంది వెళ్లారు. ఒకరి వెనుక ఒకరు నడుస్తుండగా చివరిగా రోశయ్య ఉన్నాడు. పొదల మాటున ఉన్న రెండు ఎలుగుబంట్లు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. అప్రమత్తమైన మిగిలిన సిబ్బంది వాటిని వెళ్లగొట్టి రోశయ్యను కాపాడారు. అప్పటికే గాయపడగా మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు.

ఉత్తరకాలువలో పడిపోయిన ట్రాక్టర్

- మెకానిక్ మృతి


సాదిక్ మృతదేహం


ఉత్తరకాలువలో ట్రాక్టర్

సోమశిల: మండల పరిధిలోని నల్లరాజుపాళెం గ్రామ శివారులోని సోమశిల ఉత్తరకాలువలో ట్రాక్టర్ పడిపోవడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి కథనం మేరకు.. ఆత్మకూరుకు చెందిన షేక్ సాదిక్ అలియాస్ బాబు (47) ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. నల్లరాజుపాళెం గ్రామంలో ట్రాక్టర్‌కు మరమ్మతులు చేసేందుకు శుక్రవారం వెళ్లాడు. పని ముగిశాక ట్రయల్ రౌండ్ వేసేందుకు వాహనాన్ని తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్‌తో సహా ఉత్తరకాలువలో పడిపోయాడు. సాదిక్ అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన యజమానులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. సాదిక్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

వేగంగా హౌసింగ్ బిల్లుల చెల్లింపు

- పీడీ వేణుగోపాల్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు వేగవంతంగా బిల్లులు చెల్లిస్తున్నామని హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన – అర్బన్/బీఎల్‌సీ పథకం ద్వారా 56,074, ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ ద్వారా 13,037 గృహాలు మంజూరు చేశారన్నారు. కొన్ని పూర్తికాగా మరికొన్ని వివిధ దశల నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేదన్నారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు 2,594 మంది లబ్ధిదారులకు రూ.6.43 కోట్లు విడుదల చేశామన్నారు. ఈనెల 15వ తేదీ వరకు జరిగిన నిర్మాణాలకు కూడా ఇప్పుడు నిధులు జమ చేశామన్నారు. నిర్మాణాలకు సంబంధించి ఇసుక ఉచితంగా లభిస్తుందన్నారు. అలాగే స్టీల్, సిమెంట్ గోదాముల్లో సమృద్ధిగా ఉందన్నారు. లబ్ధిదారులు మార్చి నెలలోపు తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు.